సాక్షి శ్రీకాకుళం

గురువారం, 24, ఆగస్టు, 2023

I



ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతిచెందారు. బోరు తవ్వుతుండగా రిగ్‌ను విద్యుత్ తీగలు తాకడంతో ఈ ప్రమాదం జరిగింది. - IIలో



పీఆర్ ఇంజినీర్లపై కలెక్టర్ ఆగ్రహం

విధి నిర్వహణలో అలసత్వం వహించిన పంచాయతీరాజ్ ఇంజినీర్లపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. - IIలో

పాసింజర్ రైలు రద్దు

ఆమదాలవలస: జిల్లాలో పలు రైల్వేస్టేషన్‌ల పరిధిలో సిగ్నలింగ్ పనులు చేపడుతున్నందున ఈ నెల 24, 25 తేదీల్లో 08531, 08532 నంబర్లు గల పాసింజరు రైలు రద్దు చేస్తున్నట్లు శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాసింజరు రైలు శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస), కోటబొమ్మాళి, హరిశ్చంద్రపురం, నౌపడ, పలాస వరకు నడిచేదని, ఆయా ప్రాంతాల ప్రయాణికులు గమనించాలని వారు కోరారు.

న్యూస్‌రీల్

కొత్తమ్మతల్లి దర్శనం టికెట్ల రేట్లు పెంపు

కోటబొమ్మాళి : స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో దర్శనం టికెట్ల రేట్లను పెంచుతూ రాజమండ్రి దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎస్.వెంకట సత్యనారాయణమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొక్కుబడుల టికెట్ రూ.10 నుంచి రూ.20, ప్రత్యేక దర్శనం రూ.20 నుంచి రూ.50, ఊయల సేవకు రూ.50 నుంచి రూ.100, అంతరాలయ దర్శనం రూ.50 నుంచి రూ.100కు పెంచినట్లు పేర్కొన్నారు. రేట్ల పెంపు తక్షణం అమల్లోకి వస్తుందని ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ తెలిపారు.

గొర్లెపాడు ఏఎంసీ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న విచారణ అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

కవిటి: ఇచ్ఛాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీలో కార్యదర్శిగా పనిచేసిన చిన్నికృష్ణ మార్కెట్ కమిటీ నిధులు దారిమళ్లించిన వైనంపై అధికార యంత్రాంగం విజిలెన్స్ తనిఖీలకు సిద్ధమైంది. దీనికి సంబంధించి బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలపై మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు బుధవారం అధికారుల బృందం విచారణ ప్రారంభించారు. కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ సీనియర్ సెక్రటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజమోహనరావు, శ్రీనివాసరావు, వీఆర్‌వీఎస్ ప్రసాదరాజు, ఎం.కాశేశ్వరరావులతో కూడిన బృందం ఇచ్ఛాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీలో రికార్డులు పరిశీలిస్తున్నారు. రెండు మూడు రోజులపాటు విచారణ ఉంటుంది. తుది నివేదికను రాష్ట్ర కమిషనర్‌కు నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నూతలపాటి బాబూరావు పాల్గొన్నారు.

ఇంటింటి ఓటరు సర్వే పూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2024 పూర్తయినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్ ప్రకటించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓలతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమోదు ప్రక్రియలో 97.31 శాతం పూర్తయిందని, త్వరలో శతశాతం పూర్తవుతుందని చెప్పారు. అనంతరం ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాలకు సంబంధించిన తొలగింపులు, చేర్పుల ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. వీటిపై ఎటువంటి అభ్యంతరాలు రాలేదన్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. బీఎల్‌ఓలు కొత్తగా నమోదుచేసిన ఓటర్లు, తొలగించిన ఓటర్లకు సంబంధించి డాక్యుమెంటేషన్ పక్కాగా ఉండాలని, ఇందులో ఎటువంటి పొరపాట్లు జరిగిన సహించేది లేదని హెచ్చరించారు. సక్రమంగా డాక్యుమెంటేషన్ చేయని కంచిలి మండలం కోనాడ బీఎల్‌ఓను సస్పెన్షన్ చేయాలని ఆదేశించారు. సంతబొమ్మాళి మండలం కొల్లిపాడులో ఓటరుకు సంబంధించిన డాక్యుమెంటేషన్ సరిగా లేనందున బీఎల్‌ఓకు షోకాజ్ నోటీసు జారీచేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సిబ్బంది నిర్బంధం



గ్రామస్తుల నిర్బంధంలో ఉన్న సర్వే సిబ్బంది

ఎల్.ఎన్.పేట: మండలంలోని డొంకలబడవంజ గ్రామంలో సమగ్ర భూమి రీసర్వే చేస్తున్న సిబ్బందిని స్థానిక రైతులు అడ్డుకున్నారు. గ్రామ పరిధిలోని సాగరం చెరువులో కొన్నేళ్ల క్రితం ఓ వ్యక్తికి సుమారు 6 ఎకరాల భూమికి డీ పట్టా ఇచ్చారు. సదర వ్యక్తి ఎక్కడున్నారో తెలియదని, ఆయన సాగులో కూడా లేదని, డీ పట్టా రద్దు చేయాలని ప్రజా ప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చినప్పటికీ పట్టించుకోకుండా ఆదే వ్యక్తి పేరుతో భూమి ఉన్నట్లు నమోదు చేయటం పట్ల రైతులు ఆందోళనకు దిగారు. సర్వే సందర్భంగా కుటుంబ సభ్యుల పేర్లతో భూముల వివరాలు నమోదు చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండల సర్వేయర్ రెడ్డి గవరయ్యతో పాటు ఇతర సిబ్బందిని నిర్బంధించి గ్రామంలోనే ఉంచారు. ఉన్నతాధికారులు వచ్చి కచ్చితమైన సమాచారం ఇస్తేనే విడిచిపెడతామని స్పష్టం చేశారు.

సందమామ అందింది
సిక్కోలు మురిసింది



- చంద్రయాన్–3 విజయవంతం కావడంతో జిల్లావ్యాప్తంగా సంబరాలు
- శాస్త్రవేత్తల కృషిని అభినందిస్తూ నినాదాలు
- జాతీయ జెండాను పట్టి జయహో భారత్ ర్యాలీలు

ఉత్కంఠ ఉత్సాహంగా మారింది. ఏమవుతుందోనన్న ఆతృత కాస్త ఆనంద తరంగమై ఉరకలేసింది. మునివేళ్లపై నిలబడి ఆ దృశ్యాలను వీక్షిస్తున్న కోట్లాదిమంది ఒక్కసారిగా హుర్రే.. సాధించాం.. అంటూ ఎగిరి గంతేశారు. బిగపట్టి ఉంచిన ఊపిరి ఇక ఆగలేనన్నట్లు సెల్యూట్ ఇస్రో.. సాహో భారత్.. అంటూ నినాదాల రూపంలో ఉప్పొంగింది. బుధవారం సాయంత్రం జిల్లాలో ఎక్కడ చూసినా ఇవే దృశ్యాలు. అంబరాన్నంటిన సంబరాలు. ఇండియా ప్రయోగించిన చంద్రయాన్ –3 చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని ముద్దాడే అపూర్వ ఘట్టం కోసం ఉద్విగ్నంగా, ఉత్కంఠగా ఎదురుచూసిన ప్రజలు.. ఆ ఘట్టం టీవీ తెరపై ఆవిష్కృతం కాగానే అనిర్వచనీయమైన అనుభూతి పొందారు. ఎవరికివారు తామే విజయం సాధించినంతగా సంబరపడిపోయారు. విజయోత్సవాలు చేసుకున్నారు.

– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం



నరసన్నపేట: చంద్రయాన్ అక్షర ఆకృతిలో సత్యవరం స్కూల్ విద్యార్థులు



బూర్జ: లక్కుపురం ప్రాథమిక పాఠశాలలో చంద్రయాన్ 3 నమూనాతో విద్యార్థులు

శ్రీకాకుళం: భారత కీర్తి పతాకాన్ని ప్రపంచ స్థాయిలో నిలబెడుతూ చంద్రయాన్ –3 విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తల కృషిని అభినందిస్తూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం 5:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని ఇస్రో ముందుగానే ప్రకటించటంతో 5 గంటల నుంచే ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు. తీవ్ర ఉత్కంఠతో చివరి వరకు వీక్షించారు. నిర్దేశిత సమయానికి ల్యాండ్ కావటంతో చంద్రయాన్–3 విజయవంతమైనట్లు శాస్త్రవేత్తలు కరతాల ధ్వనుల మధ్య ప్రకటించటంతో వీక్షకులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. గంతులు వేస్తూ వీధుల్లోకి వచ్చారు. ఒకరినొకరు అభినందించుకుంటూ శాస్త్రవేత్తలను కొనియాడుతూ నినాదాలు చేశారు. కొందరు యువకులు జయహో భారత్ అంటూ జాతీయ జెండాలను చేతపట్టి ర్యాలీలు చేశారు. శ్రీకాకుళం నగరమంతా జయహో భారత్ నినాదంతో హోరెత్తింది.



శ్రీకాకుళం నగరంలో చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ

జిల్లా వ్యాప్తంగా విజయోత్సవ సంబరాలు జరుపుకొన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన ప్రయోగం రాష్ట్రంలోని శ్రీహరికోట నుంచి జరగటంతో జిల్లా ప్రజల ఆనందం రెట్టింపు అయింది.



కవిటి: శిలగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జయహో ఇస్రో మానవహారం



మెళియాపుట్టి: చాపర పాఠశాలలో టీవీలో చంద్రయాన్-3ను వీక్షిస్తున్న విద్యార్థులు



కంచిలి: విజయోత్సవంలో కంచిలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

నేడు విద్యా సంస్థల్లో వీడియో ప్రదర్శన..

చంద్రయాన్ –3 విజయవంతంపై జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గురువారం వీడియో ప్రదర్శనలు నిర్వహించేందుకు ఆయా పాఠశాలల యాజమాన్యాలు రంగం సిద్ధం చేస్తున్నాయి. ప్రాజెక్టు విజయవంతంపై శాస్త్రవేత్తలు మాత్రం తొలినుంచి ఎంతో నమ్మకంగా ఉన్నారు. విజయవంతమైన క్షణాల్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తామని, దానిని విద్యార్థులకు ప్రదర్శనగా చూపించాలని ఇస్రో ప్రకటించటం దీనికి నిదర్శనం. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు ఉండటంతో దీనిని ప్రదర్శించే అవకాశం ఉన్నప్పటికీ.. సాయంత్రం 6గంటలకు ల్యాండింగ్ ఉండటంతో గురువారానికి ప్రదర్శన వాయిదా వేసుకున్నారు. కాగా బుధవారమే పలు విద్యా సంస్థల్లో విద్యార్థులు ఇళ్లకు వెళ్లి చంద్రయాన్ –3 ల్యాండింగ్ వీడియోలు చూడాలని యాజమాన్యాలు ప్రకటించటంతో చిన్నారులంతా టీవీల వద్దకు చేరుకుని విజయక్షణాలు వీక్షించారు.



తన నివాసంలో చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



పాతపట్నం: చంద్రయాన్ -3 విజయం సందర్భంగా జాతీయ జెండాలతో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

గర్వించదగ్గ విషయం



దేశం స్ఫూర్తిదాయకమైన విజయం సాధించింది. ఎంతో గర్వించదగ్గ అంశమిది. ఇస్రో శాస్త్ర సాంకేతిక ప్రగతి ప్రపంచానికి తెలిసింది. చంద్రయాన్-3 విజయం భారత ప్రజల అందరి విజయం.

– ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ప్రత్యేక గుర్తింపు..



భారత్.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచంలోనే ముందుంది. అగ్రరాజ్యాల కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తోంది. ఇస్రో విజయాలు ప్రత్యేకమైనవి. – ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రిన్సిపాల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

నమ్మకం పెరిగింది..



చంద్రయాన్ విజయం పట్ల సగటు భారతీయురాలిగా గర్వపడుతున్నాను. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు నమ్మకాన్ని కలిగించింది. వేలాది మంది శాస్త్రవేత్తలుకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు.

–జి.ఆర్.రాధిక, ఎస్పీ

అగ్రగామిగా..



ఇస్రో విజయం అద్భుతం. అదే స్ఫూర్తితో భవిష్యత్తులో చేపట్టే ఆదిత్యలాంటి మరిన్ని ప్రయోగాలు విజయవంతమై.. మానవ సంక్షేమానికి దోహదపడాలి. యువకులు, విద్యార్థులు శాస్త్ర పరిశోధనలో దేశాన్ని అగ్రగామిగా నిలపాలి. – కొయ్యాల శ్రీనివాసరావు, సైన్స్ విషయ నిపుణులు, బ్రాహ్మణతర్లా హైస్కూల్

మన సత్తాకు నిదర్శనం



చంద్రయాన్–3 విజయవంతం కావడంతో భారత దేశ సత్తాను మరోసారి మన శాస్త్రవేత్తలు ప్రపంచానికి చాటి చెప్పారు. కోట్లాది మంది భారతీయుల ఎదురు చూపులు ఈ నాటికి ఫలించాయి. – ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట ఎమ్మెల్యే

శాస్త్రవేత్తల మేధస్సు భేష్..



భారతదేశ శాస్త్రవేత్తల మేధస్సును అభినందించాల్సిన సమయమిది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో భారత్‌ను అగ్రరాజ్యాల సరసన నిలబెట్టి ప్రతీ భారతీయుడు గర్వపడేలా చేశారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని ప్రయోగాలు చేపట్టాలి. – ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి

భారతకీర్తి కిరీటంలో కలికితురాయి



ఇస్రో విజయం భారత కీర్తికిరీటంలో కలికితురాయిలా నిలుస్తుంది. భావితరాలకు స్ఫూర్తినిచ్చే విజయమిది. ఇంతటి ఘనచరిత్రకు కారకులైన ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి అభినందనలు.

– పిరియా విజయ, శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్

తెలుగునేలకు కీర్తి..



చంద్రయాన్ –3 మన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించటం వల్ల తెలుగునేల కీర్తి పెరిగింది. చంద్రయాన్ –3 విజయవంతం ప్రపంచ దేశాలల్లో భారత్‌కు గుర్తింపు తీసుకురావటంతో పాటు అగ్రదేశాల పక్కన భారత్ నిలిచింది.

– రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

సరికొత్త చరిత్ర..



నిర్విరామంగా పని చేసి భారత్ ప్రతిష్ఠను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు. కోట్లాది భారతీయల కలలను నిజం చేసేందుకు సరికొత్త అవిష్కరణలకు నాంది పలికే చంద్రయాన్-3తో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

శాస్త్రవేత్తల కృషి అభినందనీయం



చంద్రయాన్-3 విజయం భారత దేశచరిత్రలో ఓ సువర్ణాధ్యాయం. ఇస్రో శాస్త్రవేత్తలు చేసిన కృషి అభినందనీయం. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశ కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపచేయాలి.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

సైన్స్‌లో ముందడుగు..



చంద్రయాన్-3 విజయం సైన్స్ పరంగా భారత్ వేసిన ముందడుగుగా భావించాలి. దీనివల్ల భవిష్యత్‌లో ఎలాంటి ప్రయోజనాలు కలిగిస్తాయో విద్యార్థులకు వివరించాం.

– పి.ప్రవీణ, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, ఈదులవలస

విజయ పరంపర



భారతదేశం సత్తాను ప్రపంచ వ్యాప్తంగా చాటిన ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఎంతో గర్వకారణం. ఇప్పటికే ఎన్నో రకాల అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ విజయాల పరంపరం కొనసాగించింది.

– దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ



సోంపేట బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో చంద్రయాన్ -3 ల్యాండింగ్ ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తున్న విద్యార్థులు



జి.సిగడాం: కేజీబీవీలో టీవీలో చంద్రయాన్-3 వీక్షిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



కోటబొమ్మాళి బాలుర ఉన్నత పాఠశాలలో విజయానందంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

శిరీష.. మార్చుకోవాలి భాష

కాశీబుగ్గ : పలాస నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గౌతు శిరీషా మాటలు అశుద్ధమైనవని, ఇటీవల కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద మాట్లాడిన తీరు గాంధేయ వాదానికి కలంకం తెచ్చిపెట్టిందని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. మంత్రి అప్పలరాజు దంపతులను బెదిరించేలా మాట్లాడటాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు బుధవారం గాంధీ విగ్రహాన్ని పసుపు నీటితో కడిగి పాలతో అభిషేకం చేశారు. అనంతరం గిరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో గొడవలు సృష్టించేలా శిరీష మాటాడటాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. హోటల్ వద్ద తాగుబోతుల మధ్య జరిగిన గొడవకు పార్టీ రంగు పులిమి రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నేత ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు, అచ్చెన్నాయుడు, కూన రవికుమార్‌లు అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు గౌతు శిరీషా వంతు వచ్చిందన్నారు. టీడీపీ పాలనలోఅభివృద్ధి చేసి ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. తాత, తండ్రి పేరు చెప్పుకుని తిరగడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉంగ సాయికృష్ణ, పైల వెంకటరావు, పాలిన శ్రీనివాసరావు, డబ్బీరు భవానీశంకర్, జినగ లోకేశ్వరి, పిట్ట గీతారాణి, బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, శిష్టు గోపి, బల్లయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కూర వండేందుకు సిద్ధమయ్యారు..

అటవీ అధికారులకు దొరికిపోయారు!

- అదుపులో ముగ్గురు యువకులు

కాశీబుగ్గ: అడవిలో అరుదుగా కనిపించే పునుగుపిల్లి(స్మాల్ ఇండియన్ సివెట్) మాంసాన్ని కూర వండేందుకు ముగ్గురు యువకులు సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న అటవీ శాఖాధికారులు ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. కాశీబుగ్గ ఫారెస్టు రేంజ్ పరిధిలోని 3వ వార్డు పరిసర ప్రాంతంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇండియన్ ఫారెస్టు విభాగంలో ఏ-1 జంతువుగా పునుగు పిల్లికి పేరుంది. కొందరు యువకులు పునుగుపిల్లి మాంసాన్ని కూర వండుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఈ విషయం కాశీబుగ్గ ఫారెస్టు అధికారులకు తెలియడంతో మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. యువకులను కాశీబుగ్గ ఫారెస్టు రేంజ్ అధికారి మురళీకృష్ణ నాయుడు ముందుంచారు. అనంతరం పలాస పశుసంవర్ధక సహాయ సంచాలకుని కార్యాలయానికి మాంసాన్ని తరలించారు. ఏడీ పోతనపల్లి చంద్రశేఖరరావు సమక్షంలో పరిశీలించి పోస్టుమార్టానికి తరలించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ రాత్రివేళల్లో సంచరించే స్మాల్ ఇండియన్ సివెట్ అంతరించిపోతున్న అరుదైన జాతుల్లో ఒకటని పేర్కొన్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణించి ఉండవచ్చునని భావిస్తున్నామని చెప్పారు. పోస్టు మార్టం వివరాలు వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. కూర చేసుకునేందుకు సిద్ధమైన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.



పునుగుపిల్లి మాంసాన్ని పరిశీలిస్తున్న పశు వైద్యులు, ఫారెస్టు అధికారులు



మృతిచెందిన పునుగుపిల్లి

క్లుప్తంగా

నూతన ఆవిష్కరణకు పేటెంట్


ప్రదీప్

ఎచ్చెర్ల క్యాంపస్: నూజివీడులో నిర్వహిస్తున్న శ్రీకాకుళం రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం సీఎస్ఈ ఇంజినీరింగ్ విభాగం చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కోడా ప్రదీప్ తన ఆవిష్కరణకు పేటెంట్ సాధించారు. ఎలక్ట్రికల్ వాహన టెక్నాలజీకి సంబంధించిన పరిశోధనకు గాను భారత ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసింది. ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ త్వరితగతిన చేయటం, సురక్షితంగా చార్జింగ్ చేసేందుకు ఈ ఆవిష్కరణ ఉపయోగపడుతుంది. కృత్రిమ మేధ ఆధారంగా ఈ ఆవిష్కరణ చేసినట్లు ప్రదీప్ తెలిపారు. ఈ ఆవిష్కరణ విజయం పట్ల ఆదిమవాసీ ఉద్యమ హక్కుల నేత కోడా సింహాద్రి, శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి హర్షం వ్యక్తం చేశారు.

బార్గో యాప్ పనితీరు పరిశీలన


గ్రావెల్ రోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

గార : ఉపాధి హామీ పథకానికి సంబంధించి క్షేత్రస్థాయిలో బార్గో యాప్ తీరుతెన్నులను డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు పరిశీలించారు. అంపోలు పంచాయతీ వంశధార చానెల్ రోడ్డులో జరిగిన గ్రావెల్ రోడ్డు పనులు, యాప్‌లో ఉన్న సమాచారాన్ని బుధవారం ఉదయం పరిశీలించారు. యాప్‌లో అన్ని పనులను పర్యవేక్షించేందుకు సులువు అవుతుందన్నారు. జిల్లా స్థాయిలో ఇప్పటివరకు జరిగిన పనులను పరిశీలిస్తున్నామని పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సీహెచ్.సంధ్యారాణి, జేఈ నారంనాయుడు, టీఏలు మన్మథరావు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: అంపోలు సబ్ జైలులో బుధవారం ఖైదీలకు లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస కాజ్యూ, లేడ్ వనిత ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైలర్ ఉదయ్‌భాస్కర్, డిప్యూటీ జైలర్ ఎస్.రామకృష్ణ, లయన్స్ క్లబ్ మెంబర్స్ నటుకుల మోహన్, దేవభూషణ్, మల్ల జయశ్రీ, టి.శ్వేతకుమారి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద ప్రదర్శనలు


తప్పెటగుళ్ల ప్రదర్శన

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా వజ్రపుకొత్తూరులో ఉద్దాన సాహితీ సాంస్కృతి కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బొడ్డపాడు కళాకారుల జానపద నృత్యాలు, రంగం కళాకారుల తప్పెటగుళ్లు, సింగిరి కీర్తిక, సుధీష్ణల శాస్త్రీయ నృత్యాల ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలిచాయి. అనంతరం కవి,రచయిత తెప్పల కృష్ణమూర్తిని ఉద్దానం బంధు పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు పుక్కళ్ల గురయ్యనాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇరోతు హేమంత్, ఉప సర్పంచ్ బత్సల జోగారావు, కవి, రచయిత వంకల రాజారావు, వేదిక అధ్యక్షుడు లండ రుద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇద్దరు యువకుల మృతి
- సెగిడిపేటలో బోరు తవ్వుతుండగా రిగ్‌ను తాకిన విద్యుత్ తీగలు
- మృతులు ఒడిశావాసులు


మృతి చెందిన బిమ్ము సారా


మృతి చెందిన హోదా బాగ్రియా

ఎచ్చెర్ల క్యాంపస్: నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. ఎచ్చెర్ల మండలం ముద్దాడ పంచాయతీ సెగిడిపేటలో రైతు యగాడి హేమాచలం పొలంలో రిగ్‌తో వ్యవసాయ బోరు తవ్వేందుకు రణస్థలంకు చెందిన వాల్లే రమణతో ఒప్పందం కుదుర్చుకున్నారు. బుధవారం బోరు తవ్వకం పనులు ప్రారంభించారు. బోరు తవ్వుతున్న ప్రదేశం మీదుగానే 7 కేవీ విద్యుత్ లైన్లు వెళ్తున్నాయి. తీగలను కర్రతో తప్పించి బోరు తవ్వాలని భావించారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ సిబ్బందికి చెప్పలేదు. తవ్వకం ప్రారంభంలోనే విద్యుత్ తీగలను రిగ్ పైభాగం తాకింది. దీంతో విద్యుత్ షార్టు సర్క్యూట్ అయ్యింది. ఈ సమయంలో ఐదుగురు సిబ్బంది పని చేస్తున్నారు. వారిలో కింద పనిచేస్తున్న బిమ్ము సౌరా (20), హోడా బాగ్రియా (31) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు పరుగులు తీశారు. మృతులిద్దరిదీ ఒడిశా రాష్ట్రం. ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తోటి వర్కర్లు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను శ్రీకాకుళం రిమ్స్ మార్చురీకి తరలించారు. ఎస్సై వి.సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రిగ్‌ను తాకుతున్న విద్యుత్ వైర్లు



స్ఫూర్తిప్రదాత టంగుటూరి


ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తిప్రదాత అని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఇ సెక్షన్ సుపరింటెండెంట్ డి.రామమూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి అనూరాధ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధీరత్వానికి ప్రతీక..


ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ :ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధీరత్వానికి ప్రతీకగా నిలిచారని ఎస్పీ జి.ఆర్.రాధిక కొనియాడారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సెబ్ జేడీ వి.నాగమణికంఠ, అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు ఎస్.బాలరాజు, విజయ్‌కుమార్, ఆర్ఐలు ఉమామహేశ్వరరావు, సీఐలు పప్పల శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఎస్‌ఐ అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు

ఆరిలోవ: స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్‌ఐల నియామకాల్లో భాగంగా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షల కోసం విశాఖ రేంజ్ పోలీస్ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కైలాసగిరిలోని ఏఆర్ పోలీస్ మైదానంలో ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 23 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణతో కలసి బుధవారం మైదానాన్ని సందర్శించారు. పరీక్షల నిర్వహణ కోసం ఇంతవరకు జరిగిన ఏర్పాట్లను పరిశీలించారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ విశాఖ రేంజ్ పరిధిలో నిర్వహించిన రాత పరీక్షలో 17,374 మంది అభ్యర్థులు అర్హత సాధించారన్నారు. వారికి ఈ నెల 25 నుంచి శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకోసం తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన 2,745 మంది మహిళా అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు ప్రత్యేకంగా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు మెటాలిక్, స్పైస్ షూస్ ధరించి రావద్దని సూచించారు. అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్, అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

గులివిందలపేటలో పులి!


రైతులు గుర్తించిన పాదముద్రలు

కొత్తూరు: మండలంలోని గులివిందలపేట ప్రాంతంలో పులి పాదముద్రలు కలకలం సృష్టించాయి. బుధవారం పంట పొలాలను పరిశీలించేందుకు రైతులు వెళ్లగా పులి పాదముద్రలు చూసి ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అనంతరం గ్రామస్తులకు విషయం చెప్పడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు కూడా భయపడుతున్నారు.

రైతుల శ్రమదానం


సాగునీటికి అడ్డంగా ఉన్న తూడును తొలగిస్తున్న రైతులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో ఈదుపురం బాహుదానది నుంచి కేశుపురం, బూర్జపాడు, డొంకూరు పంచాయతీల పంట పొలాలకు కాలువల ద్వారా వెళ్లాల్సిన బాహుదా నీరు నిలిచిపోయింది. దీంతో సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు బుధవారం శ్రమదానం చేశారు. కాలువకు ఇరువైపులా పేరుకుపోయిన ముళ్ల కంచెలు, తూడును తొలగించారు.

రైతుల్లో వానందం


ఇచ్ఛాపురంలో జోరుగా కురుస్తున్న వర్షం

ఇచ్ఛాపురం రూరల్: వరి నారుమడులు ఎండిపోతున్న దశలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం మండలంలో ఇప్పటికే 70 శాతం వరకు వరి నాట్లు పూర్తవ్వగా, సకాలంలో వర్షం కురవకపోవడం, సాగునీరు లేకపోవడంతో 30 శాతం ఉభాలు కాలేదు. ప్రస్తుతం కురిసిన వర్షం కొంత వరకు రైతులకు ఉపశమనం కల్పించిందని మండల వ్యవసాయాధికారి బొర్ర నర్సింహమూర్తి తెలిపారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట (కొత్తూరు): ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరు మండలం మహసింగి గ్రామంలో ఏఆర్‌టీఐసీ ఎన్జీఓ భవనం ఆవరణలో ప్రధాన మంత్రి వన్‌ధన్ వికాస కేంద్రం, జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను బుధవారం ప్రారంభించారు. పండించిన పంటకు అదనపు విలువను జోడించటం వల్ల ఎక్కువ ఆదాయం పొందవచ్చని ఎమ్మెల్యే అవగాహన కలిగించారు. అధిక ధర లభించే జీడి పిక్కలతో పాటు జీడి పండ్ల నుంచి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. నాణ్యత కలిగిన జీడి పండ్ల నుంచి రసం తీసి నిల్వ చేసే ప్రాసెసింగ్ చేపట్టి విక్రయించడం వల్ల రైతులకు ఆదాయం సమకూరుతుందన్నారు.

అనంతరం సీఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కొత్తూరు, హిరమండలం పీఏసీఎస్ చైర్మన్లు చింతాడ సూర్యనారాయణ, ఎ.వి.సురేష్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు తక్షణమే అప్‌లోడ్ చేయాలి


కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులకు సంబంధించి ప్రతిపాదనలను తక్షణమే అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఎంపీడీఓలను ఆదేశించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. గడపగడపకులో పనులు ఉంటే ఉన్నాయని, లేకపోతే ప్రస్తుతం పనులు ఏమీ లేవని అప్‌లోడ్ చేయాలని సూచించారు. జూలై కంటే ముందు ఉన్న పనులను తక్షణమే అప్‌లోడ్ చేయాలన్నారు. నరసన్నపేట, ఆమదాలవలస, సోంపేట, టెక్కలి, జలుమూరు ఎంపీడీఓలు సమావేశానికి హాజరు కాకపోవడంపై షోకాజ్ నోటీసులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని డీపీఓను ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపాలిటీలలో తక్షణమే పనులు ప్రారంభించి బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ మూర్తి, సీపీఓ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు భరోసా


భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: విశ్రాంత ఉద్యోగుల సంఘానికి అండగా ఉంటామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం ఏపీహెచ్‌బీ కాలనీలో కొత్తగా నిర్మించిన విశ్రాంత ఉద్యోగుల భవనాన్ని మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు ఉపయోగపడేలా భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమమే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సూర్యారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. బుధవారం శ్రీకాకుళం బార్ అసోసియేషన్ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు క్యాంటీన్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. మిగతా సమస్యలను దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.రాము, ఉపాధ్యక్షుడు జి.చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు ఎం.భవానీప్రసాద్, వి.హరిప్రియ, జి.భాస్కరరావు, బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణ, కార్యవర్గ సభ్యులు, బి.వి.రమణ, సీనియర్ న్యాయవాదులు పొన్నాడ వెంకటరమణరావు, కంచరాన నాగభూషణరావు, నౌపడ విజయ్ కుమార్, ఏరోకొల మురళీమోహన్‌రావు, గురుగుబెల్లి నరసింహమూర్తి, కొంక్యాన సుభాష్, టి.ఖగేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట పంచాయతీ సనపలవానిపేట వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 65 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఘటనా స్థలంలోనే వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు తెలిసిన వారు ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై వి.సత్యనారాయణ పేర్కొన్నారు.

అక్టోబరు నాటికి టిడ్కో ఇళ్లు సిద్ధం


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ఆమదాలవలస: రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం ప్రత్యేక చొరవతో ఈ ఏడాది అక్టోబరు నెలాఖరు నాటికి జగ్గుశాస్త్రులపేటలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం టిడ్కో అధికారులు, బ్యాంకు మేనేజర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం మూడు కేటగిరీలలో 528 ఇళ్లను సిద్ధంచేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు నిబంధనల మేరకు వాటా చెల్లించడంతోపాటు బ్యాంకు రుణం ఒప్పందం పూర్తిచేయాల్సి ఉందన్నారు. రుణం వద్దంటే లబ్ధిదారులే నగదు చెల్లించుకునే వెసులుబాటు ఉందన్నారు. టిడ్కో ఈఈ సీతారామ్మూర్తి మాట్లాడుతూ ఇప్పటికే 95 శాతం పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా సమన్వయ అధికారులు కె.వి.సత్యనారాయణ, ఎస్.వెంకటరావు, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు శ్రీనివాసరావు, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి పగడాలమ్మ

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులకు క్రీడలు, వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ తెలిపారు. మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థల్లో బుధవారం జిల్లా స్థాయి పీడీ, పీఈటీల సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. డివిజన్ విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్ మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి నవంబర్ 9 వరకు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 17 ఏళ్లు పైబడిన వారంతా క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో పీఈటీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.సుందరరావు, జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, పీఈటీలు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజినీర్లపై కలెక్టర్ ఆగ్రహం

- నిర్మాణాలు పూర్తయినా భవనాలు అందజేయకపోవడంపై అసహనం
- తప్పుడు నివేదికలు ఇచ్చిన ఏఈలపై సస్పెండ్‌కు చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో నిర్మాణాలు పూర్తయినా గ్రామ, వార్డు సచివాలయ భవనాలను ఎందుకు అందజేయలేకపోతున్నారని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పంచాయతీరాజ్ శాఖ ఏఈలను ప్రశ్నించారు. వారి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ నెలాఖరు నాటికి భవనాలు అందజేయాలని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ శాఖ చేపడుతున్న ప్రాధాన్యత భవన నిర్మాణాలపై ఇంజినీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణాలను తక్షణమే పూర్తి చేయాలన్నారు. నివేదికలకు, పనులకు సంబంధం లేదని, పనితీరు మార్చుకోవాలని సూచించారు. ప్రాధాన్యతా భవనాలు నిర్మాణాలు పూర్తి చేయనందుకు, గ్రామ సచివాలయం భవనాలపై తప్పుడు నివేదికలు అందజేసిన కవిటి, మందస, మెళియాపుట్టి, పోలాకి, వజ్రపుకొత్తూరు మండలాల ఏఈలను సస్పెండ్ చేసేందుకు కమిషనర్‌కు నివేదికలు పంపాలని ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు చేపట్టిన భవన నిర్మాణాలకు బిల్లుల మొత్తం చెల్లించినట్లు తెలిపారు. నిధుల కొరత లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్‌బీకే భవన పనులను తక్షణమే పూర్తి చేసి వారం రోజుల్లో అందజేయాలన్నారు.

టెక్కలి ఏఈకి షోకాజ్..

ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలపై సమావేశం నిర్వహిస్తుంటే గైర్హాజరైన టెక్కలి ఏఈకి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, భవన నిర్మాణాల్లో పురోగతి లేనందున సోంపేట ఏఈకి చార్జెస్ జారీకి చర్యలు చేపట్టాలని ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ వి.ఎస్.ఎస్.ఎన్.మూర్తి, కార్యనిర్వాహక ఇంజినీర్లు సురేష్, కుమార్, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్లు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ కుటుంబానికి సాయం


చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో, విధులు నిర్వహించి మరణించిన ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్) ఏఎస్‌ఐ వై.శాసయ్య కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. శేషయ్య కుటుంబాన్ని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి అడిషనల్ విడో, ఫ్లాగ్ ఫండ్ కింద రూ.75వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సహాయ పరిపాలనాధికారి జి.సత్యశోభారాణి, వై.లిల్లీబాయ్ పాల్గొన్నారు.

'రఘుపాత్రునికి' అభినందనలు


ప్రశంసాపత్రంతో శ్రీనివాసరావు, హైస్కూల్ ఉపాధ్యాయులు

గార: తొమ్మిదో తరగతి పాఠ్య పుస్తక రచయిత, కొర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రఘుపాత్రుని శ్రీనివాసరావుకు అభినందనలు వెల్లువెత్తాయి. తెలుగు పాఠ్యపుస్తకం రచయితగా, కవిగా అందించిన సేవలకు గాను రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన డైరెక్టర్ జి.ప్రతాపరెడ్డి ప్రశంసాపత్రాన్ని పంపించారని హైస్కూల్ హెచ్ఎం వై.వాసుదేవరావు బుధవారం తెలిపారు. గతంలో పలు శిక్షణా కార్యక్రమాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో రిసోర్సు పర్సన్‌గా పనిచేశారని, మరింతగా విద్యార్థులకు మార్గదర్శనం చేయాలని ఆకాంక్షించారు. శ్రీనివాసరావును ఎంఈఓలు ఎన్.రామకృష్ణ, జి.వినోదిని, రాష్ట్ర భాషోద్యమ సంస్థ మండల శాఖ ప్రతినిధులు గణపతిరావు, తులసీదాసు, షేక్ జాఫర్, ఎల్.వి.రమణ, సంధ్యారాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.